ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక

# సూర్య



మంగళవారం 05 మార్చి 2024 , పేజీలు 4

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్


## వార్ధ నది పై వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి

**కౌటాల మార్చి 4 సూర్య మేజర్ న్యూస్**

గుండాయిపేట వార్దా వంతెన నిర్మాణ రద్దును నిరసిస్తూ కౌటాల మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ గార్కి వినతిపత్రం అందుచేత కౌటాల మండలం గుండైపెట్ నుండి మహారాష్ట్ర నందివర్ధ వార్ధనది పై హై లెవల్ వంతెన నిర్మాణానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం 75 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానిని రద్దు చేయడాన్ని నిరసిస్తూ వెంటనే ఆ బ్రిడ్జి సంబంధించిన టెండర్లను వేయించి పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ కౌటాల మండలం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ పుష్పలత కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎప్ పార్టి కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..



# అభివృద్ధిలో రాష్ట్ర సర్కార్‌కు పూర్తి సహకారం అందిస్తాం. ప్రధాని మోడీ

**-రూ.56 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోదీ**

**తెలంగాణ అభివృద్ధికి కేంద్ర సర్కార్ అన్ని విధాలుగా సహకరిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ**

**ఆదిలాబాద్ మార్చి 04 సూర్య మేజర్ న్యూస్**



అభివృద్ధిలో రాష్ట్ర సర్కార్ కు పూర్తి సహకారం అందిస్తామని దేశ ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు.సోమవారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో వర్చువల్ విధానంలో రూ.56 వేల కోట్ల ప్రాజెక్టులకు పీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి జాతికి అంకితం చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు."రాష్ట్రాభివృద్ధికి , తెలంగాణ ప్రభుత్వం కు, సీఎం రేవంత్ రెడ్డి కి సంపూర్ణంగా సహకరిస్తామని అన్నారు.తెలంగాణలో గడిచిన పదేళ్లలో వేల కోట్లకుపైగా పనులు ప్రారంభించామన్నారు. ఎన్‌టీపీసీ రెండో యూనిట్ ప్రారంభించామని చెప్పారు. దీంతో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని వెల్లడించారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గత పదేండ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. తరువాయి 2లో

# ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు

## • జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**మంచిర్యాల ప్రతినిధి,04,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు వి.రాములు, హరికృష్ణతో కలిసి



అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. చెన్నూర్ పట్టణానికి చెందిన తుంగపిండి మధుకర్ తన తండ్రి చెన్నూర్ మున్సిపాలిటీలో కామటిగా ఉద్యోగం చేస్తూ మరణించారని, కుటుంబ పోషణ కష్టంగా మారినందున తన తండ్రి ఉద్యోగాన్ని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం మాదారం టౌన్షిప్కు చెందిన గీదుల స్వరూప తాను పుట్టుకతో మానసిక దివ్యాంగురాలిని అని, తనకు అందిస్తున్న ఆసరా పెన్షన్ను నిలుపుదల చేశారని, తిరిగి అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.నస్పూర్ మండల కేంద్రానికి చెందిన మామిడాల శివాత్మిక్ తాను మూగ,చెవిటి దివ్యాంగుడినని,ఎస్.ఎస్.సి., ఈ.సి.ఈ.డిప్లొమా చేశానని,తన తల్లితండ్రులకు భారం కాకుండా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ( తరువాయి 2లో )

## ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు**



**ఆసిఫాబాద్ ప్రతినిధి 4 మార్చ్ సూర్య మేజర్ న్యూస్**

ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి చెందిన అదే భారతి తాను 10వ తరగతి చదువుకున్నానని, నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన సోగాల గౌతం గ్రామ శివారులో తనకు చెందిన భూమి నమోదు కాలేదని, సింగరేణి భూ సేకరణ రీ సర్వే చేయించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం, మార్కగూడ గ్రామానికి చెందిన కోవా బాపురావు, నవేధరి గ్రామానికి చెందిన కొర్కెట సతలబాయి తమకు గల వ్యవసాయ భూమిలో గిరి వికాస్ పథకం కింద బోరు బావి మంజూరు అయి బోరు వేయించడం జరిగిందని, విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ... ( తరువాయి 3లో )

# అభివృద్ధిలో రాష్ట్ర సర్కార్‌కు పూర్తి సహకారం అందిస్తాం. ప్రధాని మోడీ

( మొదటి పేజీ తరువాయి )

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని అన్నారు. కేంద్రంతో ఎలాంటి ఘర్షణ వాతావరణానికి వెళ్లబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి ముందుకు వెళ్తామని చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు అని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి సహకరించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని రాకను 4 కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారు.ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఎన్టీపీసీ పవర్ ప్రాజెక్టు 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంది. కానీ 1600 మెగావాట్లకు పరిమితిమైందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి పెద్దన్నలా ప్రధాని మోదీ సహకరించాలని కోరారు. హైదరాబాద్ మెట్రోకు, మూసీ నది అభివృద్ధికి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో స్కైవేల నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు సిఎం కృతజ్ఞతలు తెలిపారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 56,000 కోట్ల రూపాయలకు పైగా విలువ కలిగిన అనేక





అభివృద్ధి ప్రాజెక్టుల ను తెలంగాణలోని ఆదిలాబాద్‌లో ఈ రోజున ప్రారంభించడం, దేశ ప్రజలకు అంకితం చేయడంలతో పాటు, శంకుస్థాపన కూడా జరిపారు.సభికులను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఒక్క తెలంగాణ కే కాకుండా, యావత్తు దేశాని కి సంబంధించిన అభివృద్ధి ప్రధానమైన ప్రాజెక్టుల కు ఆదిలాబాద్ గడ్డ సాక్షి గా ఉందన్నారు. ఈ రోజు న 56,000 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన 30 కి పైగా అభివృద్ధి ప్రాజెక్టుల ను దేశ ప్రజల కు అంకితం చేయడం గాని, లేదా వాటి కి సంబంధించిన శంకుస్థాపనలుగాని ఈ రోజున జరుగుతూ ఉండడమే దీనికి కారణం అని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టులలో రాష్ట్రంలో శక్తి, పర్యావరణ మైత్రీపూర్వకమైనటువంటి స్థిరాభివృద్ధి ప్రాజెక్టుల కు తోడు రహదారి సంధానం ప్రముఖంగా ఉన్న ప్రాజెక్టులు భాగం గా ఉన్నాయి.కేంద్ర ప్రభుత్వం ,తెలంగాణ రాష్ట్రం.ఈ రెండు దాదాపుగా పది సంవత్సరాలను పూర్తి చేసుకొన్నాయి అని ప్రధాన మంత్రి చెప్పారు. రాష్ట్ర పౌరులు కన్న కలలను పండించుకోవడం కోసం అవసరమైన అన్ని విధాల సహాయాన్ని ప్రభుత్వం సమకూర్చుతోంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ రోజున సైతం 800 మెగావాట్ సామర్థ్యం కలిగినటువంటి ఎన్ టిపిసి రెండో యూనిటును ప్రారంభించడం జరిగిందనిబీ ఇది తెలంగాణలో విద్యుచ్ఛక్తి ఉత్పాదనను మరింతగా పెంచుతుంది అని ప్రధాన మంత్రి తెలిపారు. అంబారి – ఆదిలాబాద్ – పింపల్ ఖోటీ రైలు మార్గాల విద్యుతీకరణ పూర్తి అయిన సంగతిని ఆదిలాబాద్, బేలా ఇంకా ములుగులలో రెండు ప్రధానమైనటువంటి జాతీయ రాజమార్గ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగిన సంగతిని కూడా ఆయన ప్రస్తావించారు.ఈ రోజున చేపడుతున్న ఆధునిక రైలు ప్రాజెక్టులు, రహదారి ప్రాజెక్టులు తెలంగాణ తో పాటు, యావత్తు ప్రాంతం యొక్క అభివృద్ధికి జోరును అందిస్తాయి అంతేకాదు,ప్రయాణానికి పట్టే కాలాన్ని కూడా తగ్గిస్తాయన్నారు. పర్యటన రంగానికి ప్రోత్సాహాన్ని ఇవ్వడం ద్వారా లెక్కలేనన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయి అని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు.రాష్ట్రాలను అభివృద్ధిపరచడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు పోవాలి అనేదే మంత్రంగా ఉంది అని ప్రధాన మంత్రి పునరుద్ఘాటించారు. ఒక చక్కని ఆర్థిక వ్యవస్థ ద్వారా దేశం పట్ల నమ్మకం వృద్ధి చెందుతుంది, మరి రాష్ట్రాలు పెట్టుబడిని అందుకోవడం వల్ల అది కూడా లాభపడుతాయి అని ఆయన అన్నారు. గడచిన మూడు నెలల కాలంలో 8.4 శాతం మేరకు వృద్ధి చెందిన ఒకే ఒక ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఉన్నందువల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థ యొక్క అధిక వృద్ధి రేటును గురించి ప్రపంచంలో పలు దేశాలు మాట్లాడుకొంటున్నాయి అని ప్రధాన మంత్రి ప్రస్తావించారు."ఈ విధమైన వేగంతో భారతదేశం ప్రపంచంలో మూడో అతి పెద్దదైనటువంటి ఆర్థిక వ్యవస్థగా నిలవ కలుగుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. దీనికి అర్థం ఏమిటి అంటే, తెలంగాణ యొక్క ఆర్థిక వ్యవస్థ సైతం అధిక వృద్ధిని నమోదు చేస్తుంది అనేదే అని ఆయన వివరించారు.తెలంగాణ వంటి ప్రాంతాల పట్ల ఇంతకు ముందు నిర్లక్ష్యం జరిగిన విషయాన్ని ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వస్తూ, గడచిన 10 సంవత్సరాల లో పరిపాలనలో క్రొత్త పంథాల ను అనుసరించిన సంగతి ని ప్రముఖంగా ప్రకటించారు. గత పదేళ్ల లో రాష్ట్రం యొక్క అభివృద్ధి కి అధికంగా కేటాయింపులు జరిగాయన్న విషయాన్ని గురించి ప్రధాన మంత్రి తెలియజేస్తూ, "మా దృష్టిలో అభివృద్ధిని సాధించడం అంటే అది నిరుపేదల,దళితుల, ఆదివాసీల వెనుకబడిన వర్గాల మరియు నిరాదరణకు గురి అయిన వర్గాల ప్రజల కు అభివృద్ధి ఫలాలను అందించడమే" అని ప్రధాన మంత్రి అన్నారు. 25 కోట్ల మంది కి పైగా ప్రజలు పేదరికం నుండి బయటకు వచ్చారని, మరి దీనికి గాను ఖ్యాతిని పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకే ఇవ్వవలసి ఉంటుంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఆ తరహా ప్రచార ఉద్యమాలను రాబోయే అయిదు సంవత్సరాలలో మరింత ఎక్కువగా అమలు పరచడం జరుగుతుంది అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నరు డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ,కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి లతో పాటు ఎంపీ శ్రీ సోయం బాపు రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.



# ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు

## -జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

(మొదటి పేజీ తరువాయి )

మందమర్రి మండలం క్యాతనపల్లికి చెందిన దొంతుల సాయిలు, పోరండ్ల చంద్రశేఖర్ తమ పట్టా భూమికి జాతీయ రహదారి విస్తరణలో భూ సేకరణ జరిగిందని, ఈ ప్రక్రియలో తమకు రావలసిన దానికన్నా తక్కువగా ఇచ్చారని, ఈ విషయమై పరిశీలించి తమకు రావలసిన నష్టపరిహారమును ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన కామెర మురళి తనకు గ్రామ శివారులో ఉన్న భూమి ధరణిలో ఇతరుల పేరిట చూపుతోందని, సవరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన పూరెళ్ల రాజన్న, పూరెళ్ల శంకరయ్య, పూరెళ్ల బాలయ్య తమకు చెందిన భూమి ధరణిలో ఇతరుల పేరిట చూపుతుందని, ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. భీమారం మండల కేంద్రానికి చెందిన అవిడపు సురేష్, అవిడపు రమేష్ తన తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేసి పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన గోగు మహేశ్వర్ నాథ్ తాను ప్రస్తుతం కోటపల్లి మండలంలో కంప్యూటర్ ఆపరేటర్గా విధులు నిర్వర్తిస్తున్నానని, తన తల్లిదండ్రులు వృద్ధులు అయి తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారని, వారి యోగక్షేమాలు చూసుకునేందుకు తనను నెన్నెల మండలానికి బదిలీ చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి గ్రామానికి చెందిన సల్లూరి శ్రీనివాస్ తన తండ్రి పేరిట ఉన్న భూమిని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇట్టి రిజిస్ట్రేషన్ను రద్దుచేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండలం మాడవెల్లి గ్రామానికి చెందిన జూపల్లి కె.వి.రమణారావు, సంక ప్రసాదరావు తాము భూమి రిజిస్ట్రేషన్ కొరకు ధరణిలో మీ-సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాల వలన రిజిస్ట్రేషన్ చేసుకోలేదని, అట్టి సొమ్మును ఇప్పించాలని కోరుతూ వేరువేరుగా దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం రాజీవ్ నగర్కు చెందిన నడిమెట్ల రాజేశ్వరి తాము భార్యాభర్తలు ఇద్దరము అంగవైకల్యం కలిగిన వారమని, నిరుపేద అయిన తమకు ఇల్లు, బ్యాటరీ ట్రై సైకిల్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన జి. శైలజ తాను డిగ్రీ పూర్తి చేశానని, తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగు లేవని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన రామగోని అశోక్ గౌడ్ తాము ఎస్.డి.ఎఫ్. నిధుల క్రింద పాత పెర్కపల్లి వాటర్ ట్యాంక్ నుండి దొమ్మటి మల్లేష్ ఇంటి వరకు సి.సి. డ్రైన్ నిర్మించడం జరిగిందని, సంబంధిత బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన చిలారపు శశిరేఖ కుటుంబ పంపకాలలో తన భర్త పేరిట రావలసిన భూమి ఆయన చనిపోయినందున తన పేరిట మంజూరు చేసి పట్టా పాసుపుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నెన్నెల మండల కేంద్రానికి చెందిన మేరుగు గట్టయ్య తన దరఖాస్తులో గ్రామ శివారులోని లావునిపట్టా భూమిలో అక్రమంగా చేస్తున్న లే-అవుట్, కట్టడాలను నిలుపుదల చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాసిపేట మండలం బుగ్గగూడ గ్రామానికి చెందిన మేంద్రపు రాజన్న మండలంలోని పల్లంగూడ శివారులో గల ప్రభుత్వ భూములను కొందరు అక్రమంగా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్నగర్ పట్టణానికి చెందిన ఎం.డి. ముశీరుద్దీన్ తనకు చెన్నూర్ మండలం ఎల్లక్కపేట శివారులో ఉన్న భూమికి సంబంధించి విరాసత్ చేసి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో71 దరఖాస్తులు అందాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి పరిష్కారం దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు

( మొదటి పేజీ తరువాయి )

వేరువేరుగా అర్జీలు సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని ఆర్.ఆర్. కాలనీకి చెందిన పెందోర్ భువనేశ్వరి తాను కులాంతర వివాహం చేసుకున్నానని, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబమని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణంలోని బసంతి నగర్ కు చెందిన మిత్ర సుబోధ్ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికల్ పేట మండలం అగర్ గూడ గ్రామానికి చెందిన గోలేటి శారద తన భర్త తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించారని, తన కూతురు చదువు, పోషణ కొరకు ఉపాధి కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహేగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన సుంకరి భీమయ్య తన తాతకు చెందిన భూములు ఇతరుల పేరిట రికార్డు మార్పిడి జరిగిందని, ఈ తప్పిదాన్ని సవరించి వారసులమైన తమ పేరిట నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన గైని తిరుపతి తాను 10వ తరగతి చదువుకున్నానని, జీవనోపాధి లేక కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉందని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణం కాపువాడకు చెందిన పోతరాజుల ప్రమీల తమకు కాగజ్ నగర్ మండలం భట్టుపల్లి గ్రామ శివారులో వారసత్వ భూమి ఉందని, ఇట్టి భూమికి పట్టాదార్ పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన బుసి పోశం తన



తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేసి పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన గొర్లపల్లి మాధవి తనకు గ్రామ శివారులో ఉన్న ఇల్లు భూ సేకరణలో పోతుందని, రీ సర్వే చేయించి పునరావాసం, రీ సెటిల్మెంట్, జీవనోపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్



**మంచిర్యాల టౌన్,ఫిబ్రవరి 5,సూర్య మేజర్ న్యూస్:**

ఇంటర్మీడియట్ పరీక్షలు సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్.(ఐజి) మంచిర్యాల ఐబీ చౌరస్తా లోని అల్ఫార్స్ జూనియర్ కళాశాల నందు గల పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎక్కువ మంది గుమిగూడవద్దని సూచించారు. పరీక్షలు జరిగే సమయంలో పోలీస్ అధికారులు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అధికారులు ఎవరైనా సరే పూర్తిగా తనిఖీ చేశాకే కేంద్రం లోపలికి అనుమతించాలని అక్కడ విధులలో ఉన్న సిబ్బందికి సూచించారు. ఇంటర్మీడియట్ పరీక్షలు కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పరీక్ష సమయం కన్నా గంట ముందు పరీక్ష కేంద్రాల చుట్టూ పోలీస్ వారు తనిఖీ చేయడం జరుగుతుంది అన్నారు. ప్రశ్నపత్రాలు తీసుకు వెళ్ళడం ఎగ్జామ్ పూర్తయిన తర్వాత మరియు జవాబు పత్రాలను తిరిగి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చే వరకు పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని,పరీక్ష కేంద్రాల వద్ద కూడా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని,ఈ బందోబస్త్ ఇంటర్మీడియట్,పదవ తరగతి పరీక్షలు పూర్తి వరకు ఉంటుందని, విద్యార్థులు కూడా పరీక్షలు పూర్తి అయ్యేంతవరకు ఎవరు మాల్ ప్రాక్టీస్ కు పాల్పడకుండా సహజంగా పరీక్షలకు హాజరై రాయాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి సెల్ ఫోన్ ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ ఐపిఎస్.మంచిర్యాల ఏసిపి ఆర్. ప్రకాష్ ,మంచిర్యాల పట్టణ ఇన్స్పెక్టర్ రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

---

## పోస్టల్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



**ముధోల్,04మార్చ్,సూర్య, మేజర్ న్యూస్**

మండల కేంద్రమైన ముధోల్ లోని మహాలక్ష్మి మందిరం ముందర పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు సర్వీస్ సెంటర్ సోమవారం ప్రారంభమైంది. ఈ పోస్టల్ సర్వీసు సెంటర్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల ను ప్రజలకు మరింత చేరువలో తీసుకె ళ్లేందుకు పోస్టల్ సర్వీస్ సెంటర్ ఏర్పా టు చేయడం జరిగిందని నిర్వాహకు లు పుప్పాల రాజు తెలిపారు. ఈ పోస్ట ల్ సర్వీస్ సెంటర్ లో అన్ని బ్యాంకు సేవ లతో పాటు పోస్టల్ శాఖలో నిర్వహిం చే అన్ని రకాల సేవలను వినియోగ దారులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ పోస్టల్ సర్వీస్ సెంటర్ ను మండల కేంద్రంతోపాటు మండలం లోని ఆయా గ్రామాల ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.

## పేదలకు అన్నదానంతో ఆదుకుంటున్న ఆంజనేయులు

**లోకేశ్వరం,మార్చ్ 03,సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ లో ఒక పెళ్లి వేడుకలో మిగిలిపోయిన అన్నం,పప్పు,కూరలను సేకరించిన ఫుడ్ బ్యాంక్ చైర్మన్ ఎం.ఆంజనేయులు ముధోల్ మండలంలోని తరొడ గ్రామ సరిహద్దులలో నివాసముంటున్న పేదవారికి,ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు వారి పిల్లలకు అన్నదానం చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు.



---

### పదోన్నతి పై వెళ్లిన

# అధికారికీ సన్మానం

**శ్రీరాంపూర్, మార్చ్ 4, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓ టూ జిమ్ గా పదోన్నతి పై వెళుతున్న శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి వి.పురుషోత్తంరెడ్డిని గని ఉద్యోగులు సోమవారం ఆత్మీయంగా సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా కాలరీ మేనేజరు సుదీర్ జక్కుల్ వార్ మాట్లాడుతూ వి పురుషోత్తం రెడ్డి చాల సుదీర్గ కాలం పాటు శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగుల మన్ననలు పొందినారని పేర్కొన్నారు, శ్రీరాంపూర్ ఏరియా ఎస్ ఓ టూ జిమ్ గా పదోన్నతి పై వెళ్ళడం చాల సంతోషకరంగా ఉందని తెలియచేసారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ యొక్క జీవిత కాలం పెంపొందిచడం కోసం పురుషోత్తంరెడ్డి ఎనలేని కృషిచేసారని తెలిపారు. బదిలీ పై వెళ్ళుచున్న వి. పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ఉద్యోగులతో కలసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాఅని అంతే కాకుండా ఎస్ ఆర్ పి ఓసీపీ ఉద్యోగులు అందరు కూడా క్రమశిక్షణ, రక్షణ తో కూడిన నిర్దేశిత ఉత్పత్తి సాదించడం చాల సంతోషకరం అన్నారు. తదనంతరం, కొత్తగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి గా బాధ్యతలు తీసుకున్న టి. శ్రీనివాస్ ని శాలువాతో ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమములో ఏఐటియుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి. ఎస్.కె బాజీ సైద, ప్రాజెక్ట్ ఇంజినీరు చంద్రశేఖర్, పిట్ కార్యదర్శి మోతె లచ్చన్న, రక్షణాధికారి ఐ శ్రీనివాస్, అధికారుల సంఘం గని ప్రతినిధి కమ్రుద్దిన్, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి శంకర్ ఇతర అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.



---

# పజాపాలన సేవ కేంద్రం ప్రారంభం

### - దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీపీ విమలాబాయి, ఎంపిడివో వరలక్ష్మి

**వాంకిడి, మార్చ్ 04,సూర్య మేజర్ న్యూస్,**

మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సోమవారం ఎంపీపీ ముండె విమలబాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇచ్చిన గడువులో ప్రజా పాలన దరఖాస్తులు ఇవ్వని తెల్లరేషన్ కార్డు కలిగిన వారు ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు అర్హులైన వారు ప్రజాపాలన దరఖాస్తు ఫారాలు నింపి వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఎవరు ఆందోళనలకు గురి కావొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వి.వి వరలక్ష్మి, ఎంపివో ఖాజా జిజాఉద్దిన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**నిర్మల్ మార్చి 4, సూర్య మేజర్ న్యూస్**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాఖల వారిగా పెండింగ్ లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిశీలన చేపట్టి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అన్నారు. ధరణి, రెవెన్యూ, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీ.ఆర్ఓ గంగయ్య, ఆర్డీఓ రత్నాకళ్యాణి, డీ.ఆర్డీ.ఓ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమంలో అర్జీల స్వీకరణ



**మందమర్రి టౌన్, మార్చి 4, సూర్య మేజర్ న్యూస్.**

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ చంద్రశేఖర్, మండల ఎంపిడిఓ ఎన్ రాజేశ్వర్ లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బి బీరయ్య, మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు

- నేరస్థులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు
- సత్ప్రవర్తన కలిగి జీవిస్తే రౌడీషీట్ ఎత్తేస్తాం
- రామగుండం సీపీ శ్రీనివాసులు



**లక్షెట్టిపేట,సూర్య మేజర్ న్యూస్**

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, సత్ప్రవర్తన కలిగి జీవిస్తే చట్టపరిధిలో రౌడీషీట్ ఎత్తేస్తామని, నేరస్థ జీవితం నుండి మంచిగా మారడానికి అవకాశం కల్పిస్తామని రామగుండం సీపీ ఎం శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ...గతంలో కేసులు ఉన్న నేరస్తులకు, భూ కబ్జాలకు పాల్పడి పలు రకాల కేసుల్లో ఉండి ప్రస్తుతం సత్ప్రవర్తనతో, నేర పూరిత జీవితానికి దూరంగా ఉండి, మంచి జీవితం గడుపుతున్న వారికి మంచిగా మారేందుకు అవకాశం ఇస్తామని, రౌడీ షీట్స్ ఉంటే చట్టపరిధిలో తీసివేస్తామన్నారు. రౌడీయిజం, భూకబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, గుడుంబా, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అనుమానితులపై ప్రత్యేకంగా నిఘా ఉంటుందన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. నేటి నుండి ఎలాంటి చట్ట విరుద్ధమైన చర్యలు చేస్తే సహించేది లేదని, అలాంటి వారు తమ ప్రవర్తన మార్చుకోవాలని తెలిపారు. అక్రమ దందాలు అరికట్టేందుకు ప్రత్యేక టీమ్ టాస్క్ ఫోర్స్ ను దింపడం జరిగిందన్నారు ఇప్పటికే కమిషనరేట్ పరిధిలో పలు కేసులు కూడా చేయడం జరుగిందన్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే బియ్యం కేవలం ప్రజలకే అందాలని పక్కదారి పట్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడాలని, ప్రజల్లో పోలీసులు మంచి పేరు సంపాదించడమే తనకు ముఖ్యం అన్నారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ఆర్ ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్, అదనపు ఎస్సై రామయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## సొంత డబ్బులతో రోడ్డు మరమ్మత్తు చేయించిన షౌకత్ పాషా



**ఖానాపూర్ రూరల్ మార్చి 4 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ ప్రెసిడెంట్ షౌకత్ పాషా ఎనిమిదవ వార్డులో రోడ్డు మరమ్మత్తు పనులను తన సొంత డబ్బులతో చేయించినారు. ఎనిమిదవ వార్డులో ఏ పని జరిగిన ఆ పని పూర్తి అయ్యేవరకు అక్కడే ఉంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదవ వార్డులోని సమస్యలు తన దృష్టికి వస్తే, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సంఘ సేవ చేస్తున్న షౌకత్ పాషా ను ఎనిమిదవ వార్డు ప్రజలు అభినందించినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు షేక్ అమీర్, ఆడెపు రవి, సయ్యద్ ఫైమూద్, చింటూ. శ్రీను, గణేష్, షేక్ యూనిస్ పాల్గొన్నారు

## తాహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

**బెల్లంపల్లి టౌన్ మార్చి 4 సూర్య మేజర్ న్యూస్**

బెల్లంపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తాహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి సమస్యను త్వరగా పరిష్కారం అయ్యేటట్లు తన వంతు సహాయ సహకారాలు ప్రజలకు అందిస్తానని, ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణిలో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో మండలాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వశిష్ట ఇంపల్స్ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

**సోన్, మార్చి 4 సూర్య మేజర్ న్యూస్:**

వశిష్ట ఇంపల్స్ ఈ టెక్నో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సోమవారం ప్రాజెక్టు వర్క్ లో భాగంగా ఫీల్డ్ ట్రిప్ కు వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాల నందు కాన్సెప్ట్ బేస్డ్ లెర్నింగ్ కి ప్రోత్సాహం ఎక్కువ ఉంటుందని ,అందులో భాగంగానే వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి పంటలను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులు ఎక్కువగా నేర్చుకుంటారని తెలిపారు. అనుభవ రూపంలో పాఠాలు నేర్చుకోవడం గొప్ప విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవదాస్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా పాలన కేంద్రం ప్రారంభం



**సోన్,మార్చి04 సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయడానికి ప్రజా పాలనలో భాగంగా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు ఫిర్యాదులను కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కొరకు కార్యాలయ సిబ్బంది ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిఘా నేత్రం ఏర్పాటుతో నేరాల కట్టడి..సిఐ శశిధర్ రెడ్డి

**మందమర్రి టౌన్, మార్చి 3, సూర్య మేజర్ న్యూస్.**

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, వీటితో నేరాలను కట్టడి చేయవచ్చని మందమర్రి సిఐ కే శశిధర్ రెడ్డి తెలిపారు. రామన్ కాలనీ ఏరియాలోని మేకల మండిలో రాజన్నల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆరు సీసీ కెమెరాలను సిఐ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, దొంగ, నేరాల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహద పడుతున్నాయని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు కాలనీల ప్రజలు దొంగతనాలు నివారించేందుకు గ్రామాల్లో నిఘా నేత్రం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేదని, ప్రస్తుతం సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయన్నారు. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శివనీతి రాజశేఖర్, సహకర సంఘం సభ్యులు జక్కుల శంకర్, మొగిలి కనకయ్య, జక్కుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

